# కొత్తరెమ్మలు

లిఫ్టుకోసం వెయిట్ చేస్తూంటే నీరజ వచ్చింది నవ్వుతూ, "కంగ్రాట్స్!" వస్తూనే అంది.

ఆశ్చర్యంగా ఆమెను చూశాను. ఈ లోపల లిఫ్ట్ రావడం, మేము దానిలోకి వెళ్ళగానే, ఆపరేటర్ మూడు అంకె నొక్కేయడం ఒక్కసారి జరిపోయింది.

"ఎందుకూ?"

"నిన్న నువ్వు రానందుకు. ఆ మాత్రం సస్పెన్స్‌తో నిన్ను పనిష్ చేయ్యద్దా! నీకు చేతనయితే గెస్ చెయ్యి. లేకపోతే బాస్ వచ్చేవరకూ ఆగు!" అంది.

ఇద్దరం ఎవరి ప్లేస్‌ల్లోకి వాళ్ళం వెళ్ళిపోయాం. రెడ్డి, విజిత కూడా కంగ్రాచ్యులేషన్స్ చెప్పి వెళ్ళిపోయారు కానీ కారణం చెప్పలేదు.

మేడం "బాస్ పిలుస్తున్నారు" అంటూ పోచయ్య వచ్చాడు.

నీరజని చూశాను.

'వెళ్ళు' అన్నట్లు కళ్ళతో చెప్పింది.

నవ్వుతూ రెడ్డి తల గట్టిగా ఊపుతున్నాడు.

"మిమ్మల్ని డి.జి.ఎం.గా ప్రమోట్ చేశారు" యశ్వంత్ నవ్వుతూ లెటర్ నా చేతికందిచ్చాడు.

ఆశ్చర్యం...ఆనందం...కళ్ళల్లో పల్చగా నీటి తెర.

"పార్టీ ఇవ్వాల్సిందే"

"ష్యూర్!"

"థ్యాంక్యూ! మీరే లేకపోతే, నేనే స్థితిలో ఉండేదాన్నో. బహుశా ఓ పిచ్చాసుపత్రిలో..."

"ఓ...కమాన్!" నో పాస్ట్. వెళ్ళు, వెళ్ళి పార్టీకి ఎరేంజ్‌మెంట్ చూడు!"

నా సీట్లోకి రాగానే గబగబా అంతా చుట్టు ముట్టేశారు.

ఆనందంగా ఉంది.

ఈ నాటి ఈ ఆనందానికి కారణం యశ్వంత్. యశ్వంత్ లాంటి బాస్ దొరకడం నిజంగా నా అదృష్టం.

చంటి పిల్లాణ్ణి పోగొట్టుకుని, తల్లితండ్రులకు దూరమై, ఓదార్చేందుకు దగ్గర వాళ్ళు కరువైనప్పుడు యశ్వంత్ ఇచ్చిన ధైర్యంతోనే మామూలు మనిషి అయ్యాను.

నా భర్త నుంచి విడాకులు తీసుకున్న రోజున కూడా, యశ్వంత్ ఫిలాసఫీని జీవితానికి ఏ విధంగా అప్లై చేయాలో చెప్పాడు. తండ్రిలాగా ఓదార్చాడు. స్నేహితుడిలాగా నా బాధలన్నీ అర్థం చేసుకున్నాడు. జీవితాన్ని ఏ కోణం లోంచి చూస్తే స్ట్రెస్ ఫ్రీగా ఉంటుందో చూపించాడు.

నిజానికి యశ్వంత్ చిన్న వాడు కాదు. రిటైరవడానికి సిద్ధంగా ఉన్నాడు. అయినా అందరినీ 'యశ్వంత్' అని పిలవమని అంటాడు.

మంచి లీడర్‌షిప్ క్వాలిటీస్ ఉన్నాయి. ఆఫీసు వాతావరణాన్ని తన మాటలతో, చేతలతో మార్చి చాలా ఉన్నతి స్థితికి తీసుకెళ్ళాడు.

నీరవ్ గురించి, బాబు గురించి బాధపడుతుంటే ఓసారి చూశాడు. "క్లియోపాత్ర ముక్కు చిన్నది కాదు, అందమైనది కాబట్టే హిస్టరీ అద్దం తిరిగింది. ఏది జరగాలో అది జరిగిపోతుంది. అయిన దాని గురించి ఆలోచనలు, నిద్ర పోగొట్టుకోవడం...ఊహుం, నీ వరస బాగాలేదు. స్ట్రెస్ ఉంటే లాభం లేదు."

మామూలుగా ఉండడానికి ప్రయత్నం మొదలు పెట్టాను. స్ట్రెస్ ఫ్రీ లైఫ్ గురించి పుస్తకాలు ఆఫీసులోనే ఉన్నవి చదవడం మొదలు పెట్టాను.

ఏదైనా పొరపాటు జరిగితే...

"పొరపాట్లు సహజం. ఒక్కసారే పర్‌ఫెక్ట్ అవలేవు. ఎంత దూరం ప్రయాణం అయినా ఓ చిన్న అడుగుతోనే మొదలు పెట్టాలికదా! అడుగుల్లో కాన్‌స్ట్రేషన్, కాషన్

రెండూ ఉండాలి. ఈసారి నుంచి కొంచెంపని మీద కాన్‌సెంట్రేషన్ ఉంచు. నీలో వెతుకుదామన్నా తప్పులు కనపడవు.

'జీవితం గ్రైండింగ్ స్టోన్ లాంటిది. నిన్ను కిందైనా ఉంచి గ్రైండ్ చేస్తుంది. లేదా చక్కగా పాలిష్ చేసి పైకి తెస్తుంది. అయితే అదంతా నీ చేతుల్లోనే ఉంది."

నిజమే, ఇది నా జీవితం.

నేనే మలుచుకోవాలి.

"నీ పనిలో క్వాలిటీ ఉండాలి. ఆ క్వాలిటీలో ఐదు 'డీ'లు ఉండాలి. డెడికేషన్, డివోషన్, డిసిప్లిన్, డిస్క్రిమినేషన్, డిటర్మినేషన్."

అంతే. నేను వెనక్కి తిరగలేదు.

"చూడు, గణపతిని నీకు ఆదర్శంగా పెట్టుకో. పెద్దతల–పెద్దగా, ప్రాఫిటబుల్‌గా ఆలోచించడానికి, పెద్ద చెవులు – కొత్త ఐడియాలు, కొత్త సజెషన్స్ వినడానికి, చిన్న కళ్ళు – చురుగ్గా చూస్తూ, చేతిలో పనిని తొందరగా చెయ్యడానికి, పెద్ద ముక్కు – చుట్టుపక్కల అన్ని విషయాల్లో కెలుకుతూ, ఎక్కువ నేర్చుకోవడానికి, చిన్న నోరు – తక్కువ మాట్లాడడానికి."

సేల్స్ ప్రమోట్ చెయ్యడానికి ఏం చెయ్యాలో సలహాలిస్తూండేవాడు.

"అన్నింటికీ బ్రూస్, స్పైడర్ కథ పనికిరాదు. మన సేల్స్‌కి డ్రెక్కర్ కథ పనికివస్తుంది. ఒకటి రెండు సార్లు ఫెయిలయితే మూడోసారి వేరేది చెయ్యి. అంతేకాని, అన్నింటికీ లైఫ్ అండ్ డెత్ క్వొశ్చన్‌గా ఆలోచించకూడదు."

ఎంత ముందు కెళ్ళానో.. ఈనాటి ప్రమోషన్ – డి.జి.ఎం.గా ప్రమోషన్‌తో తెలిసింది.

జోక్స్, సేల్స్, మార్కెటింగ్, అడ్వర్టయిజింగ్, ఇన్సిడెంట్స్, మధ్యమధ్య యశ్వంత్ కొటేషన్స్, నవ్వులు...హాయిగా జరిగిపోయింది పార్టీ. చీకటి పడిపోయింది. అందరం ఇంటి మొహం పట్టాం.

నా ఫ్లాట్‌లోకి వెళ్ళి లైట్ వేశాను. చీకటి పరుగెత్తింది మూలకి. అలసటగా సోఫాలో వాలిపోయాను.

ఎంత నిశ్శబ్దం!

అగాధాల నిశ్శబ్దం.

ఇంతవరకూ గడిచిన క్షణాలకి, ఈ క్షణానికి ఎంత తేడా? ఇందాకటి నా నవ్వులు నా వెనకాలే ప్రతిధ్వనిస్తున్నాయి.

నా నవ్వులు, నా సంతోషం పంచుకోడానికి ఎవరూ లేరు.

ఎవరికీ అక్కర్లేదు.

కృంగిపోతున్నాను. నా ధైర్యం పోతోంది.

ఏదో చెయ్యాలి. లాభం లేదు. నా ధైర్యం పోయిందంటే నేనెలా బతగ్గలను?

చాలా రోజుల తర్వాత నా ఒంటరితనం నా ముందుకొచ్చింది. ఆ వెనకాలే నీరవ్. ఆ వెనక్కాలే గతం.

---

"ఇవాళ డాక్టరు దగ్గరికి వెళ్ళాను. నవంబరు నెలాఖరుకి డెలివరీ అవుతుంది అన్నారు. అన్నీ నార్మల్" హాయిగా నవ్వుతూ అన్నాను.

"ఇంకా నాలుగు నెలలు ఆగాలి. టెస్ట్ చేయించకూడదా, పాపనో, బాబో తెలిసిపోతుంది" నవ్వుతూ అన్నాడు.

"ఉహూఁ, సస్పెన్స్ లాస్ట్ మినిట్ వరకూ ఉంటేనే తెలుస్తుంది. అయినా, ఏదైనా మెటోబోలిక్ డిసార్డర్స్, కన్‌జెనిటల్ డిఫెక్ట్స్ ఉంటేనే చేస్తారు. అయినా అవసరం ఉంటే డాక్టరే చెప్తారు. మనకి ఎవరైనా పరవాలేదుగా? అలాంటప్పుడు టెస్ట్ ఎందుకు? కదా! ఏమంటావ్?"

అప్రసన్నంగా మొహం పెట్టాడు.

"నీ ఇష్టం."

మనస్సు చివుక్కుమంది.

నిజమే అని ఎందుకనలేదు. అహం దెబ్బ తింటుందనా?

ఇరవై రోజులు బిజీ. కొత్త ఛెయిర్మన్, వైస్ ప్రెసిడెంట్ కమర్షియల్, ఫైనాన్స్ వస్తున్నారు. ఎక్కువ సేల్ అయినందుకు అవార్డులు, ఆ పార్టీలు...ఇంత బిజీలో నేను ప్రెగ్నెంట్ అన్న విషయం కూడా మరిచిపోయాను. నీరవ్ జూనియర్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్‌కోసం నాసిక్ దగ్గర దేవలాలి వెళ్ళాడు.

"బేబీ నార్మల్‌గా అనిపించడం లేదట, ఏమ్నియో సెంటిసిస్ చెయ్యాలన్నారు' నీరవ్ వచ్చాక అన్నాను.

"అంటే...నార్మల్ కాదా?" గబుక్కున దగ్గరికొస్తూ అన్నాడు.

"అలాగే అనిపిస్తోందట" తప్పు చేసినట్లుగా.

"నీ కెంత నిర్లక్ష్యం! నేను అప్పుడే అన్నాను టెస్ట్ చేయించమని. అప్పుడే చేయించి ఉంటే బాగుండేది. ఇప్పుడు చూడు...అసలు నీకు నా మాటంటే వాల్యూ లేదు!" తీవ్రంగా అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

అపశ్రుతి...

అబ్నార్మల్‌గా ఉన్నాడు లోపల బాబు.

టెర్మినేట్ చేయడానికి లేట్ అయిపోయింది.

"అప్పుడే నా మాట విని ఉంటే టెర్మినేట్ చేయించి ఉండేవాళ్ళం. ఇప్పుడు చూడు, అనుభవించు!"

ఒక్కసారి అని ఊరుకుంటే బాగుండేది. రోజూ అంటుంటే నీరవ్ అంటే అసహ్యం పుట్టింది. దూరంగా ఉండడం మొదలు పెట్టాడు.

మా ఇద్దరి మధ్య చీలిక రోజురోజుకీ ఎక్కువైపోయింది.

ఇంట్లో ఉంటే ఆలోచనలు ఎక్కువైపోతాయని ఆఫీసుకెళ్ళడానికే నిశ్చయించుకున్నాను.

ఈ నీరవ్‌ని నేను ప్రేమించాను. ఇప్పుడు ఆ ప్రేమ ఏది?

రోజూ ఆరున్నర అయ్యేటప్పటికి స్కూటర్ తీసుకుని నా ఆఫీసు ముందు హాజరయ్యేవాడు. అలాంటిది ఈ రోజున ఎడమొహం పెడమొహం.

రోజూ ఓ ప్రెజంటేషన్. ఆ ఎమోషన్స్, ఆ ఫీలింగ్స్ ఏవి? ఓ కప్పుకింద ఉండడం మొదలు పెట్టాక అన్నీ ఒక్కసారి...అలా గాల్లోకి ఎగిరిపోయాయా?

నా ప్రమేయం లేకుండా రోజులు గడుస్తున్నాడు.

ఆఫీసులో నీరజ, యశ్వంత్, రెడ్డి లేకపోతే నేను దాదాపు పిచ్చిదాన్నే అయ్యేదాన్ని.

ప్రేమించడంలో ఫెయిలయ్యాను.

"జీవితంలోని అత్యంత ముఖ్యమైన నిర్ణయంలో పొరపాటు జరిగిపోయింది." పెళ్ళికి ముందూ నాకూ, నీరవ్‌కి మధ్య ఉన్నది కేవలం శారీరకాకర్షణ మాత్రమేనా? ఎన్నో ఒట్లు వేశాడు. ఎన్నో ఆశలు కల్పించాడు. వాటన్నిటికీ వాల్యూ లేదా? ఇంత చదువు చదువుకునీ మామూలు, అతి సామాన్యమైన ఆడది చేసే తప్పే తనూ చేసింది.

అంటే తన చదువు తనని మానసికంగా ఎత్తుకి ఎదగనీయలేదా? ఆఖరికి ఎంతో మధురంగా ఉంటుందని అనుకున్న ఈ ప్రెగ్నెన్సీలో కూడా అపశ్రుతి.

అబ్నార్మల్ బాబు. అంటే పెద్ద తల, పెద్ద కళ్ళు, చట్టిముక్కు, ఎత్తు నుదురు...ఇలాగే ఉంటాడా? ఊహించలేకపోతున్నాను. ఏదో ఓ క్షణాన ఈ లోకంలోకి వస్తాడు. ఎలా బతగ్గలడు? బుద్ధి సరిగా ఉంటుందా? నడక వస్తుందా? నీరవ్...సొంత తండ్రికే వాడి మీద అభిమానం లేదు. ఎలా అయినా వాడిని నేను బాగా చూడగలను..నేనే తండ్రిగా, తల్లిగా ఉండగలను. ఆ ధైర్యం నాకుందా?

అత్తగారు వచ్చారు. అంతవరకూ మా మీద ఉన్న కోపం పోయిందట.

ఆ రోజు రానే వచ్చింది. నెలలు పూర్తిగా నిండకుండానే అర్ధరాత్రి...ప్రకృతి, లోకం అంతా నిద్రపోతున్నప్పుడు.

నాకు తెలివి వచ్చేసరికి అత్తగారూ, నీరవ్ మాట్లాడుకుంటూ కనిపించారు.

నేను కదలడం చూసి నీరవ్ నా దగ్గరికి వచ్చి జుట్టు సరిచేశాడు. ఆ చిన్న పనికి, గూడు కట్టుకున్న దుఃఖం తెంచుకుని బయటికొచ్చింది. ఆ చిన్న ఆప్యాయతకోసం ఎన్నో రోజులనుంచి తపించి పోతున్నాను.

"ఏడవకు. బాబుని ఇన్‌క్యుబేటర్‌లో పెట్టారు."

"ఎలా ఉన్నాడు? చాలా అబ్నార్మల్‌గా ఉన్నాడా? నేను చూడాలి."

"ముందు కాఫీ తాగు. ఇడ్లీ కూడా తినొచ్చన్నారు."

నీరవ్ మొహం మారింది. నిన్నటివరకూ మొహంలో ఉన్న భావాలు వేరు. ఒక మనిషి, రెండు మొహాలు.

"ఎలా ఉంది?" ఆ ఆప్యాయత అసహజంగా ఉంది.

బాధ, దుఃఖం, అందులోనే నిద్ర.

ఎక్కడో మాటలు...అందులో నీరవ్ గొంతు. మత్తు...కళ్ళు తెరవాలనిపించడం లేదు.

"పిల్లవాడు బతకుతాడా?"

"బతకడని అనేశారు. ఎన్ని రోజులుంటాడో చెప్పలేరట."

బలవంతంగా కళ్ళు తెరిచాను. అత్తగారితోపాటు మరో నలుగురు ఆడవాళ్ళు – నా మూడేళ్ళ వైవాహిక జీవితంలో వాళ్ళను నేనెప్పుడూ చూళ్ళేదు.

కళ్ళు మూసుకున్నాను.

"వాళ్ళ ఇంట్లో ఎవరికైనా ఇలా పుట్టారా?"

"ఏమో.., ఏం తెలుసు? మా కిష్టం లేని పెళ్ళి ఇది. ఇన్నేళ్ళు వాళ్ళు మా ఇంటికి రాలేదు. ఆ సంగతి మీకు తెలియదా? మేమూ వెళ్ళలేదు. తీరా ఇలా అయ్యాక మేమే రాజీ పడి వచ్చాము. చూస్తే...పిల్లాడు ఇలా పుట్టాడు. ఏం రాసి పెట్టి ఉందో వాడి మొహాన."

"అసలు మనవాళ్ళు ఎందుకన్నారు - అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూసి పిల్లని తెచ్చుకోవాలని. ఎందుకు? ఇదిగో ఇందుకు."

"ఇదిగో నీరవ్! ఇందాక డాక్టరు అన్నారు కూడా - మీ ఫ్యామిలీలో ఎవరికైనా ఇలా పుట్టారా అని. అంటేఇది వాళ్ళ వంశంలోంచే వచ్చిమాట. ఆ రక్తంలోనే ఉందేమో. మనింట్లో లేదు."

ఊపిరి బిగబట్టాను. నీరవ్ ఏమంటాడా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను.

నీరవ్ ఏమీ అనలేదు! ఆఖరికి, 'అంతా నీ చాదస్తం'అని కూడా అనలేదు. ఆశ్చర్యం.

ఏడు పొచ్చేసింది. ఒంటి దాన్నయినందుకు, నా వంశ చరిత్ర లాగుదామనుకుంటున్నందుకు.

"పెడిగ్రీ అనాలసిస్ చేస్తారుట. ముందు ముందు పిల్లలు కావాలో, వద్దో దాన్ని బట్టి మనం తేల్చుకోవాలిట, నీకు తెలిసినది చెప్పు వాళ్ళకి."

"నాకు మా వాళ్ళగురించి ఏమీ తెలియదు. మేం ఉన్న ఊళ్ళో సరైన కాలేజీ లేక నేను హాస్టల్లో ఉండి చదువుకున్నాను. నే నెలా చెప్పగలను?"

మర్నాడు మెల్లగా నడుచుకుంటూ, నీరవ్ సాయం రాగా బాబుని చూడటానికి వెళ్ళాను.

గాజు పలకలోంచి చూశాను.

ఒళ్ళంతా కట్లు, ప్లాస్టర్స్, ట్యూబ్స్...

ఎర్రగా...కదలకుండా ఓ పక్కకి ఒత్తిగిలి పడుకుని ఉన్నాడు.

ఈ లోకంలోకి ఏ ఆశతో వచ్చాడు? ఎందుకొచ్చాడు? ఆ చిన్ని కళ్ళలో కలలు ఉండి ఉంటాయా? అమ్మ ఒళ్ళో పడుకోవలసినవాడు, ఒక్కడూ జీవితంతో

పోరాడుతున్నాడు. నీరవ్ లాంటి మనుషులు రంగులు ఎలా మారుస్తారో తెలియచేశాడు. నాకో పాఠం నేర్పాడు – దగ్గరి వాళ్ళుకూడా అవకాశవాదులేనని. ఈ బాబే పుట్టకపోతే,ఈ [illegible] నీరవ్‌తో ఇంకా కాపురం చేస్తూ ఉండేదాన్ని. ఎన్ని రోజులుంటాడు? – ఆ ఊహ రాగానే [illegible] [illegible]శాను.

జీవితం ఆగినట్లుంది.

ఏదో ఓ క్షణాన... ఆ రోగం అలాంటిదట, అది జీన్స్‌లోంచే వచ్చిందట...తలో మనిషితలోమాట. బిలబిలమంటూ మీడియావాళ్ళు వచ్చేసారు.

"రీసెర్చిల వాళ్ళు, బ్లడ్ శాంపిల్స్ కావాలిట. డి.ఎన్.ఎ.కి మెటీరియల్‌ట."

"మీ ఇంట్లో ఎవిరికైనా..."

"ప్లీజ్! నన్నూ, నా బాబుని వదిలేయండి. మీ క్కావాల్సింది డిఎన్ఎ మెటీరియల్‌కదా! నేను చెప్తా –

"కేరళ వెళ్ళండి. కొబ్బరి నూనె వాడినా అసలు గుండె జబ్బు అనేది రాని వంశంలోని ఓ కుటుంబం ఉందిట. వెళ్ళి వాళ్ళ బ్లడ్ శాంపిల్స్ తీసుకోండి.

"అందరికీ మలేరియా వస్తున్నా, మలేరియా రాని కొన్ని కుటుంబాలు అస్సాం, మణిపూర్ ప్రాంతాల్లో ఉన్నాయట. చార్మినార్ దగ్గర ఓ యింట్లో కొంతమందికి నాలుగు వేళ్ళు ఉన్నాయట. ఆ జీన్స్ ని సెపరేట్ చెయ్యండి. ప్రైజులు తెచ్చుకోండి.

"నన్ను, నా బాబుని వదిలేయండి..."

"చాలా డిస్టర్బ్‌డ్ స్టేట్‌లో ఉంది..."అంటూ వాళ్ళందరినీ పంపేసి, నన్ను మెల్లగా పట్టుకుని రూమ్‌కి తీసుకొచ్చి పడుకోబెట్టాడు.

"ఈసారి ఆడపిల్లయితే చెప్పులేరటకాని, మగపిల్లాడు అయితే ఇంతేనట! అని డాక్టరుగారు అన్నారు" నా ఎదురుగానే అత్తగారు ఎవరితోనే అంటున్నారు.

"మన వాళ్లలో పిల్లలే లేరా? మా ఖర్మ!" అందరితోనూ ఇదే మాట.

నీరవ్ కూడా తల్లి మాటలకే సపోర్ట్ చేస్తున్నాడు. తను ప్రేమించి పెళ్ళి చేసుకున్నందుకు బాధపడుతున్నాడని ఆ మౌనం చెప్తోంది.

ఈ మనిషిని ఎలా నమ్మాను? ఎన్ని నీతులు మాట్లాడాడు. ఎన్ని మాటలు చెప్పాడు? అన్నీ పైపైనేనా? అభిమానం చంపుకుని నీరవ్‌తో గడపనా? ఎక్కడికైనా వెళ్ళనా? పుట్టింటికెళ్తే...మమ్మల్ని కాదని పెళ్ళి చెసుకున్నావు, మా ఇంటికి ఏ మొహంతో

వస్తున్నావ్ అని అంటారా? ఇంతమంది ఉన్న ప్రపంచంలో నాకు ఎవరూ లేరా? ఒంటరిదాన్నా? మాట సాయం కూడా లేదా? ముసలిదాన్నయ్యాక అయినా ఒంటరితనం తప్పదు కదా? పిల్లలు చూడరు. మొగుడు వయసుపైబడిపోతాడు. అప్పుడైనా ఒంటరితనం అనుభవించక తప్పదు. అది ఇప్పటినుంచే ఎందుకు ప్రాక్టీసు చెయ్యకూడదు?

ఆఫీసులో వాళ్ళు అంతా వచ్చారు. ఉద్యోగం మానేయద్దు, అనవసరమైన విషయాలకి ఇంపార్టెన్స్ ఇవ్వద్దు అన్నారు.

"నా గతం, నా వర్తమానం అస్తవ్యస్తంగా ఉంది. పాడైపోయింది అని తెలివి తక్కువాడు అనుకుంటే, భవిష్యత్తు ఇంకా ఉంది అని తెలివైనవాడు అనుకుంటాడు. రేపటి భవిష్యత్తుకి ఈ రోజు నుంచే పునాది వెయ్యి." యశ్వంత్ ధైర్యం చెప్పాడు.

"ఇదా జీవితం అనుకోవడంలోనూ, ఇదే జీవితం అనుకోవడంలోనూ తేడా తెలుస్తోందా? ఎవరో ఏదో చేస్తారనుకుంటే ఎలా? నీ జీవితం నీ చేతుల్లో ఉంది."

రెండు రోజుల పిల్లాడు తనకి మించిన శక్తితో జీవితంతో పోరాడుతుంటే నేనెందుకు ఆ పని చెయ్యలేను? నాలో శక్తిఉంది. అది బయటికి రావాలి. ఎత్తైన కొండ ఎక్కాలంటే మొదట్లో చిన్న అడుగులే వెయ్యాలి. ఈ సత్యం నేను తెలుసుకోవాలి.

మరో రెండురోజులు జీవితంతో పోరాడి, అలసిపోయి ఈ లోకం విడిచి వెళ్ళిపోయాడు.

ఇంటికొచ్చే వాళ్ళతో నీరవ్, అత్తగారు, మావగారు బిజీగా ఉంటే, నేనొక్కదాన్నేగదిలో నిశ్శబ్దంగా ఏడుస్తూ ఉండిపోయాను.

"చీకటి పడిందంటే మరో ఉదయం వస్తోందని కదా! ఇవాళ ఈ తలుపు మూసుకుందని బాధపడితే ఎలా? మరో తలుపు తెరుచుకుంటుంది.

"కష్టాలు మనుషులకే వస్తాయి. ఎవరికి రావు అంటే శ్మశానాల్లో సమాధి అయిపోయిన వాళ్ళకి రావు. వాళ్ళకి, మనకి తేడా ఎక్కడ? లైఫ్...బీయింగ్ ఎ లివింగ్ థింగ్! సంతోషించు నువ్వు మనిషివని."

యశ్వంత్ తను చదివిన పుస్తకాల్లో కొటేషన్స్ చెప్తూ ధైర్యం చేస్తున్నాడు. మామూలు మనిషిని చేయడానికి ట్రై చేస్తున్నాడు.

యశ్వంత్ చిన్నవాడే అయితే తప్పకుండా మమ్మల్ని నీరవ్ అనుమానించేవాడు. చిన్న మనవడూ, మనవరాలూ ఉన్న వయసు. నా తండ్రి వయసువాడే. స్వంత తండ్రి ఓదార్చలేక పోయాడు. 'నా ఫ్రెండ్స్ ఏమనుకుంటారు? మన వాళ్ళు ఏమనుకుంటారు' ఇవే తన తండ్రి మాటలు. ఒకళ్ళకోసం తన రక్తాన్ని కూడా లెక్క చెయ్యనంత అహంకారమా మనిషికి.

పెద్దవాళ్ళంటే సలహాలు, ఇవ్వాలా, వద్దా? కష్టం వచ్చినప్పుడు ఆఖరికి మాట సాయం చెయ్యని ఈ పెద్దరికం ఎందుకు?

మెల్లమెల్లగా నీరవ్ అంతరార్థం తెలిసింది. అత్తగారి ఆలోచనలు అర్థం అవుతున్నాయి. "రెస్ట్ తీసుకో! విశ్రాంతి నీ కవసరం!" అంటూ నా గదిలోకి రావడం మానేశాడు.

ఈ మనిషిని ఎలా నమ్మాను? పిల్లల్ని కనడానికేనా నేను? పూర్వం...పాత మనుషులు...చదువులేని వాళ్ళు అంటే అర్థం ఉంది. ఈ యుగంలో కూడా...ఇంత చదువుకుని కూడా...అవే ఆలోచనలా?

పెళ్ళికి ముందు స్నేహం, ప్రేమ...అంతా మోసమా? నా భ్రమా?

ఆఫీసుకు వెళ్ళడం మొదలు పెట్టాను.

'పడవలు ఒడ్డున ఉంటే సురక్షితంగా ఉంటాయి. అంతమాత్రాన పడవల్ని పనీపాటా లేకుండా ఒడ్డునే ఉంచేస్తామా? సముద్రం మీదికి తీసుకువెళ్ళమా? లీవ్‌కన్నా ముందే ఆఫీసులో జాయినై మంచి పని చేశావ్!"

"సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పోగొట్టుకోవడం అంతటి నష్టం మరొకటి లేదు. బి బ్రేవ్!"

నిజమే. నేను ధైర్యంగా ఉండాలి.

నా భర్త నన్ను భార్యగా చూడకపోతే నేను జీవించలేనా? నన్ను ఓదార్చకపోతే ... మామూలు మనిషిని అవలేనా?

నా తల మీద చేయి వేసి ధైర్యం ఇవ్వకపోతే ఏం?

ఇది నా జీవితం.

దానికి సంపూర్ణత్వం నా నుంచే రావాలి.

ఈ ఆస్తి, ఈ వంశం అంటూ మథన పడుతున్న అత్తగారితో, నీరవ్‌తో అన్నాను – "ఎవరినైనా పెంచుకుందాం" అని.

"అదెలా కుదురుతుంది? ఎవరో రక్తం...ఎలా పెంచుకుంటాం?"

"పోనీ సర్రోగేట్..." నా మాట పూర్తి అవలేదు.

"ఎవరో అమ్మాయి డబ్బుకోసం నా పిల్లల్ని మోయడం..."

అంటే ... మరో పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యంలో ఉన్నాడా?

స్వార్థం ఏ విధంగా మనిషినిదిగజార్చిందో నీరవ్‌ని చూస్తే తెలిసింది.

"అంటే...నీఉద్దేశ్యం..." బాధతో గొంతు పూడుకుపోయింది. గబగబా గదిలోకి వెళ్ళాను.

"అది కాదు..."అంటూ సంజాయిషీ ఇచ్చుకోడానికి నా వెనకాలే వస్తాడని ఎదురు చూశాను. కానీ రాలేదు.

ఎవరి మాటలు వాళ్ళే మింగడం అంత అజీర్ణం మరొకటి లేదు.

అందుకే విడాకులు తీసుకుందామని అన్నాను.

నీరవ్ అడ్డు చెప్పలేదు.

అసహ్యం వేసింది.

భార్య అంటే...నీరవ్ డిక్షనరీలో అర్థానికి.

జీవితంలోని అత్యంత ముఖ్యమైన మలుపులో తీసుకోవాల్సిన నిర్ణయంలో పెద్ద పొరపాటు జరిగిపోయింది.

ఫెయిలయిపోయాను.

ఆఫీసులో అదే అని గట్టిగా ఏడ్చేశాను.

అందరూ ఓదారుస్తున్నారు.

"నేను చెప్పేది వింటావా, అలా ఏడుస్తూ ఉంటావా?"

కళ్ళు తుడుచుకున్నాను.

"లింకన్ గొప్పవాడు అని ఒప్పుకుంటావా?"

నేనేం మాట్లాడలేదు.

"లింకన్ బిజినెస్‌లో ఫెయిలయ్యాడు. పెళ్ళాం పోయింది. స్పీకర్‌గా ఓడిపోయాడు. కాంగ్రెస్‌కోసం నుంచుని ఓడిపోయాడు. ఎలక్షన్లలో ఓడిపోయాడు. సెనేటర్‌గా నుంచుందామనుకుని అందులో కూడా ఓడిపోయాడు. వైస్ ప్రెసిడెంట్ పదవికి పోటీచేసి ఓడిపోయాడు. ఆఖరికి యాభై ఒకటో ఏట ప్రెసిడెంట్‌గా గెలిచాడు. ఆయన జీవితంలో గెలుపులకన్నా ఓటమి ఎక్కువ. నీలా ఏడుస్తూ కూర్చున్నాడా?"

"అంతెందుకు, యుద్ధ చేసిన ముఖ్యమైన యుద్ధాల్లో నెపోలియన్ చాలాసార్లు పరాజయం పొందాడు. అందుకని యుద్ధాలు మానేశాడా? ఇంకొకళ్ళ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకో!

"ఏ విధంగా నువ్వు అన్నీ మరిచిపోతావో అది నీ చేతుల్లో ఉంది. నీ మైండ్‌ని బిజీగా ఉంచు. ఎన్నో పనులు కల్పించుకో."

"ఎంతలా చేసినా రాత్రి అయ్యేటప్పటికి ఒంటరిదాన్ని అన్న సంగతి భయపెడుతోంది."

"ఎవరినైనా పెంచుకో – ఓబాబుని...ఓపాపని...దాంతోపాటు పెద్దయ్యాక వాళ్ళు వేసే ప్రశ్నలకి కూడా జవాబులు సిద్ధం చేసుకో! బ్యాంకులో డబ్బుదాచు. అది చూసే ఏదైనా సంస్థ వాళ్ళో, హాస్పిటల్ వాళ్ళో నీకు పిల్లల్ని ఇస్తారు. నీ ఈ ప్రెజెంట్ స్టేజ్‌లో నీకు ఎవ్వరూ ఏ అనాథ శరణాలయాల వాళ్ళు కూడా పిల్లాణ్ణికాని, పిల్లనికానీ ఇవ్వరు.

"పెంచుకో దలచినప్పుడు ఎవరి తాలూకు, వాళ్ళలో జీన్స్, వాళ్ళ రక్త శుద్ధి గురించి, కులగోత్రాల గురించి అడగకు. జీన్స్ ఏదైనా, పెరిగిన ప్రభావం మనిషిమీద చాలా ఎక్కువగా ఉంటుంది. మానసికంగా హెల్తీ వాతావరణంలో పెరిగేవాళ్ళు మానసికంగా దృఢంగా ఉంటారు. నీ చదువు, విజ్ఞానం, తెలివి – అన్నీ కూడా ఆ పిల్లల్ని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి ఉపయోగించు. బెస్టాఫ్ లక్!"

చాలారోజుల తర్వాత గతం ముందుకొచ్చింది.

నీరవ్ గురించిన ఆలోచనలతో నిద్ర పట్టలేదు. ఇవ్వాళే ఈ ఆలోచనలు ఆఖరు.

ఒక్కదాన్ని ఇటుపైన జీవితం గడపడం కష్టం. కాగితం,పెన్ను తీసుకున్నాను. నా ఉద్యోగం, ఆదాయం, ఆస్తి, చదువు, వయస్సు – అన్నీ వివరంగా రాస్తూ ఇద్దరు పిల్లల్ని పెంచుకోవడానికి ఇవ్వమని ఉత్తరం రాశాను – నిర్మలా అనాథ శరణాలయానికి.

❖ 12.2.97, ఆంధ్ర ప్రభ వారపత్రిక ❖.

❖❖❖